దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణా తరగతులు మే 1 నుంచి జూన్ 13వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. నాంపల్లి ఆదాబ్ హోటల్ పక్కన ఉండే గాంధీభవన్ హైస్కూల్‌లో 42 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షతో పాటుగా లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూరించిన దరఖాస్తులను గాంధీ భవన్ హైస్కూల్‌లో అందజేయాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతాం

గన్‌ఫౌండ్రీ: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు చేస్తున్న అన్యాయంపై త్వరలో మాదిగల ఆత్మగౌరవ బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.నవీన్‌రాజ్ తెలిపారు. మాదిగలపై జరుగుతున్న కుట్రను నిరసిస్తూ బుధవారం మాదిగ రాజ్యాధికార పోరాట సమితి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి గన్‌పార్కు వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు టికెట్ కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీకి ఓటు రూపంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

నిద్రలో నిఘా నేత్రాలు ..!

నిర్వహణ లేక పని చేయని సీసీ కెమెరాలు

కేసుల దర్యాప్తులో ఆటంకాలు



ఘాంసిమియాగూడ పంచాయతీలో పని చేయని కెమెరాలు

శంషాబాద్ రూరల్: నేరాల నియంత్రణలో కీలకపాత్ర పోషించే సీసీ కెమెరాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంచాయతీలు, మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రలు చాలావరకు పని చేయక అలంకారప్రాయంగా మారాయి. దీంతో నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు ఆధారాలు సేకరించడంలో పోలీసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దాతల సహాయంతో..

రోడ్లు, వీధుల వెంబడి దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అంతేగాకుండా ఇళ్లు, దుకాణాల వద్ద కూడా కొంతమంది స్వచ్ఛందంగా కెమెరాలు బిగించుకున్నారు. అయితే కమ్యూనిటీ సీసీ కెమెరాల సీడీఆర్‌లను పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ పోలీసుల శాఖ నిర్వహిస్తుండగా.. చాలాచోట్ల సీసీ కెమెరాలు పని చేయడంలేదు. వీటికి మరమ్మతులు చేయించడంలో జాప్యం జరుగుతుండడంతో నేరాల అడ్డుకట్టకు ఇబ్బందులు తప్పడం లేదు.

పెరుగుతున్న నేరాలు..

పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు పెరుగుతున్నాయి. బైక్ చోరీలతో పాటు చైన్‌స్నాచింగ్ కేసులు నమోదవుతున్నాయి. ఆయా కేసుల్లో నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారింది. అయితే చాలా చోట్ల నిఘా నేత్రాలు పని చేయక పోవడంతో పోలీసులు దర్యాప్తు ముందుకు సాగడంలేదు.

ఏటీఎంలో చోరీ.. ఆధారాల కోసం అవస్థలు

పాల్మాకుల వద్ద బెంగళూరు జాతీయ రహదారి పక్కనున్న ఏటీఎంలో ఈ నెల 14 అర్ధరాత్రి చోరీ జరిగి సుమారు రూ.19 లక్షల నగదు దోచుకున్నారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలపై దుండగులు నల్లరంగు స్ప్రే చేసి ఆధారాలు లేకుండా చేశారు. అయితే ఈ ప్రాంతంలో రహదారి, రోడ్లు వెంబడి ఉన్న సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగల ఆచూకీ, ఆధారాలు సేకరించడం పోలీసులకు సవాలుగా మారింది.

అలంకారప్రాయంగా కెమెరాలు

కెమెరాలు ఏర్పాటు చేసినా.. నిర్వహణ సరిగా లేక అలంకారప్రాయంగా మారాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 4592 కెమెరాలు ఉండగా.. వీటిలో 4254 కెమెరాలు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో కమ్యూనిటీ, నేనుసైతం, నిర్భయ పేర్లతో కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్భయ కెమెరాల్లో 13కు గాను కేవలం 5, కమ్యూనిటీ కెమెరాలు 626కు కేవలం 296 మాత్రమే పని చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. చాలా చోట్ల కీలకంగా ఉన్న కెమెరాలు పని చేయకపోవడంతో నేరాల అదుపు అంతంతమాత్రంగానే ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


పాల్మాకులలో రహదారిపై పని చేయని సీసీ కెమెరా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అత్తాపూర్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఉరివేసుకుని మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ రషీద్ మియా తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన సునీల్ కుమార్ (39) భార్య సుధారాణితో కలిసి 13 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని హుడా కాలనీకి వలస వచ్చాడు. షేక్‌పేట ప్రాంతంలో టీ షాపు పెట్టి జీవనోపాధి పొందుతున్నాడు. రెండేళ్ల క్రితం తనతో కలిసి ఉంటున్న సోదరుడు కేన్సర్‌తో మృతి చెందాడు. అప్పటి నుంచి సునీల్ కుమార్ మద్యానికి బానిసై వ్యాపారంపై శ్రద్ధపెట్టడం లేదు. దీంతో పాటు కుటుంబసభ్యులతో గొడవపడుతూ ఉండేవాడు. బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఇంటి డాబాపై నిద్రకు ఉపక్రమించగా, సునీల్ కుమార్ ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉదయాన్నే మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

కుమారుడితో కలిసి తల్లి అదృశ్యం


రాములమ్మ

మణికొండ: మహిళ తన కుమారుడితో కలిసి అదృశ్యమైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో ఈనెల 20వ తేదీన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా గున్మల్ గ్రామానికి చెందిన రాములమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదర్‌షాకోట్‌లోని మాధవీనగర్ కాలనీలో తన అక్క అన్నమ్మ వద్ద 20 రోజులుగా ఉంటుంది. ఈ నెల 20వ తేదీన ఉదయం అక్క, బావ పనులకు, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లోనే ఉన్న రాములమ్మ తన మూడేళ్ల కుమారుడితో కలిసి కనిపించకుండాపోయింది. పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో మంగళవారం రాత్రి అక్క పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న గడ్డం రంజిత్ రెడ్డి సతీమణి సీతారెడ్డి

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని గగన్‌పహాడ్ గ్రామంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డం రంజిత్ రెడ్డి సతీమణి సీతారెడ్డి, రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు ఎస్.ధనుంజయ, బ్లాక్ ప్రెసిడెంట్ మహ్మద్ ఖలీద్, సాయి రెడ్డి, వెంకటేశ్, లక్ష్మణ్, శ్రీశైలం, రత్నం, శ్రీనివాస్, శివ, సతీష్, గంగయ్య, అశోక్, సద్గుణచారి, ఉస్మాన్, పాండు, కిశోర్, బాబ్లూ, నరసింహయాదవ్, బొల్ల వెంకటేశ్, ఓంప్రకాశ్, రాజ్ కుమార్, యాదయ్య, సవితారెడ్డి, గీత, ఫరీద్, జుబేర్, దస్తగీర్, ఆంజనేయులు, శారద, మమత, ప్రియాంక, మహేశ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, రమేశ్ ముదిరాజ్, గోపి, నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రంజిత్‌రెడ్డి నామినేషన్ దాఖలు


సమావేశంలో మాట్లాడుతున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

బండ్లగూడ: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం ఏ-బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నామినేషన్ ర్యాలీకి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 152 నుంచి ఈ విజయోత్సవ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.

డీజిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్ట్


పోలీసుల అదుపులో ట్యాంకర్ల డ్రైవర్లు

గచ్చిబౌలి: కర్ణాటక నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తెల్లవారుజామున పట్టినాగులపల్లి శ్రీదేవి ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలించిన డీజిల్‌ను ఉంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి రూ.10 లక్షల విలువైన డీజిల్, ఏడు చిన్న డీజిల్ ట్యాంకర్లను, ఏడుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. రాధాకృష్ణ అనే వ్యాపారి కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ అక్రమ రవాణా చేస్తూ రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నాడు. డోర్ స్టెప్ డెలివరీ సర్వీస్ నడుపుతున్న సూర్య అలియాస్ సాయి రామ్‌కు అతను డీజిల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రాధాకృష్ణ రాష్ట్ర వ్యాప్తంగా డీజిల్ సరఫరా చేస్తున్నాడని, అతడిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితులు రాధాకృష్ణ, సూర్య, రితేష్ పరారీలో ఉన్నారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు..!


అక్రమంగా వెలసిన నిర్మాణాలు


రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు

- యథేచ్ఛగా చెట్ల నరికివేత..!
- రోడ్లకిరువైపులా వృక్షాల వ్యర్థాలు
- మరోవైపు అసలే ఇరుకు రోడ్లు.. ఆపై జోరుగా అక్రమ నిర్మాణాలు
- ఇబ్బందుల్లో స్థానికులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చాలా మంది గృహ నిర్మాణదారులు కనీస నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు నిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయని భారీ వృక్షాలను నేలకూలుస్తూ మరో వైపు వాటి వ్యర్థాలను రోడ్లకిరువైపులా వేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్తాపూర్ హైదర్‌గూడ ఉప్పర్‌పల్లి వెంకటేశ్వర స్వామి కాలనీ తదితర ప్రాంతాల్లో గృహ నిర్మాణదారులు టన్నుల కొద్ది నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే వేస్తుండడంతో ఆ మార్గం గుండా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోవడంతో పాటు ఫిర్యాదు చేసిన వారిని దూషించడంతో పాటు గొడవకు దిగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల అత్తాపూర్ డివిజన్‌లోని వాణిజ్య సముదాయాల్లో జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. 10, 12 ఫీట్ల రోడ్లను సైతం వదలకుండా నిర్మాణాలు చేపడుతూ జనజీవనానికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. ప్రజాప్రతినిధుల జోక్యంతోనే ఈ అక్రమ కట్టడాల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

శంషాబాద్ విమానాశ్రయానికి నేరుగా ఆర్టీసీ బస్సులు

గోల్కొండ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే పుష్పక్ బస్సులు నేటి నుంచి రూట్ మారనున్నాయి. ఈ వివరాలను బుధవారం మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తి తెలిపారు. ప్రస్తుతం మెహిదీపట్నం నుంచి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా వెళ్లే బస్సులు ఫ్లై ఓవర్ కింద ఉన్న రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తాయని ఆయన తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. మెహిదీపట్నం నుంచి వెజిటెబుల్ మార్కెట్, రేతిబౌలి, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్ ఎక్స్‌రోడ్, ఆరాంఘర్ నుంచి ఈ పుష్పక్ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. మాసాబ్‌ట్యాంక్, విజయనగర్ కాలనీ, హుమాయూన్‌నగర్, మెహిదీపట్నం, రేతిబౌలి, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్ క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు దీన్ని వల్ల ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ పుష్పక్ బస్సు సౌకర్యం నేటి అర్ధరాత్రి నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ప్రతి గంటకు ఒక పుష్పక్ బస్సు ఉంటుందని ఆయన తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

అత్తాపూర్ : విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. హరిణి అత్తాపూర్ ప్రాంతంలోని ఓ కళాశాలలో చదువుతోంది. కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హరిణి తండ్రి రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు.

'రేగులకుంట' పునరుద్ధరణకు ఓకే


రేగులకుంట చెరువును శుభ్రం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: రేగులకుంట చెరువు పునరుద్ధరణ లక్ష్యంగా బుధవారం సేల్స్‌ఫోర్స్, మల్లిగవాడ్ ఫౌండేషన్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. రాయదుర్గంలోని దివ్యశ్రీ ఓరియన్ ఐటీ సెజ్‌లోని సేల్స్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం సేల్స్‌ఫోర్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఆపరేషన్స్ సైట్ లీడ్ టెక్నాలజీ ప్రొడక్ట్స్ సంకేత్ అటల్ విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులో భాగంగా సహజ మురుగునీటిని శుద్ధి చేసి, ఆరువేల మొక్కలు నాటుతామని చెప్పారు. మల్లిగవాడ్ ఫౌండేషన్, యూత్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వంటి సంస్థలతో భాగస్వామ్యం అనేది సానుకూల మార్పును తీసుకురావడానికి కీలకమైన దశను సూచిస్తుందన్నారు. రేగుల కుంటచెరువును పునరుద్ధరించడం సంతోషంగా ఉందని లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా, మల్లిగవాడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్ మల్లిగవాడ పేర్కొన్నారు. పట్టణీకరణ, కాలుష్యం, ఆక్రమణ వంటి కారణాల వల్ల నగరంలో నీటి వనరులు వేగంగా క్షీణించాయన్నారు.

మెరిసిన గురుకుల కళాశాల విద్యార్థినులు

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ


సిరిమల్లి
467 మార్కులు


ప్రియాంక
466 మార్కులు


హర్షిత
466 మార్కులు


భావన
466 మార్కులు


విక్టోరియారాణి
467 మార్కులు


గౌరమ్మ
984 మార్కులు


తరుణిక
986 మార్కులు


భాష్విత
468 మార్కులు


శ్రేష్టారెడ్డి
992 మార్కులు


గౌసియా
967 మార్కులు



పి.నిష్ఠ
(987 మార్కులు)


ఫాతిమా అన్సారీ (436 మార్కులు)

మణికొండ: ఇంటర్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం 99 శాతం, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఫలితాలు సాధించారు. ఫస్టియర్ బైపీసీలో 440 మార్కులకు గాను కె. హాసిని, పి.మధుమిత 437 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. ఎ. హారిక 436 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంపీసీలో 470 మార్కులకు విక్టోరియా రాణి, టి. సిరిమల్లి 467 మార్కులతో మొదటి స్థానం, ఎస్. ప్రియాంక, ఆర్. హర్షిత, ఇ. భావన 466 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. సెకండియర్ ఎంపీసీలో 1000 మార్కులకు బి.తరుణిక 986 మార్కులతో మొదటి స్థానం, జె.గౌరమ్మ 984 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. బైపీసీలో ఎం. అక్షయ 977 మార్కులతో మొదటి స్థానం, వి.నాన్సీ 976 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఉత్తమ మార్కులు సాధించిన గురుకుల కళాశాల విద్యార్థులను రీజినల్ కోఆర్డినేటర్ అధికారి ఆర్. శారద, ప్రిన్సిపాల్ ఎల్‌బీ. కృపావరం అభినందించారు.

వ్యాలీ ఓక్‌లో రికార్డు మార్కులు..

మణికొండలోని వ్యాలీ ఓక్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఫస్టియర్ ఎంపీసీలో ఎస్. భాష్విత 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించింది. సెకండియర్‌లో కంచర్ల శ్రేష్టారెడ్డి 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించింది. కళాశాల డైరెక్టర్లు విద్యార్థులను అభినందించారు.

రాణించిన పేద విద్యార్థిని..

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన గౌసియా టోలిచౌకీలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివి ఉత్తమ మార్కులు సాధించింది. తండ్రి షేక్ మహ్మద్ యూసుఫ్ టైలర్‌గా పనిచేస్తూ తన కూతురును చదివించాడు. ఆమె సెకండియర్‌లో 1000 మార్కులకు గాను 967 మార్కులు సాధించింది. దాంతో ఆమె బంధుమిత్రులు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు..

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల మోడల్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో ఎం.ఐశ్వర్య (ఎంపీసీ)461/470, వీఎల్.జెన్నిఫర్(బీపీసీ) 433/440, శృతిసాహు (సీఈసీ) 451/500, బి.నవ్య(ఎంఈసీ)357/500 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో కిరణ్‌గురు (ఎంపీసీ) 981/1000, కె.పవిత్ర (బీపీసీ) 923/1000, ఎం.స్రవంతి (సీఈసీ) 960/1000, భానూరి అంకిత(ఎంఈసీ) 897/1000 మార్కులు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ సత్తా

రాజేంద్రనగర్: ఇంటర్ ఫలితాల్లో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సెకండియర్ బైపీసీలో పి.నిష్ఠ 987 మార్కులు, ప్రాచీ ఉపాధ్యాయ 977 మార్కులు సాధించారు. ఎంపీసీలో స్వప్నరాణి 940, ఎం.డి.సమీర్ 936, సీఈసీలో వి.అంకిత 776 మార్కులు, సోనం 937 మార్కులు సాధించారు. ఫస్టియర్ బైపీసీలో ఫాతిమా అన్సారీ 436 మార్కులు, ఆర్.సాయి సింధూరి 431 మార్కులు, ఎంపీసీలో అమీనా ఇఫత్‌కు 462 మార్కులు వచ్చాయి. సీఈసీలో కె.పూజ 467 మార్కులు, వై.ఇందు 418 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య, అధ్యాపకులు మాన్య, స్వప్న, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణా రెడ్డి, మురళీ, కరుణాకర్, శ్రీజన్య, నవీన్, కిషన్, గోపి, కృష్ణా రెడ్డి, చంద్రశేఖర్, పార్థసారథి, శశిధర్, భరత్, నర్సింగ్, కుమార్ అభినందించారు.

శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ముద్దం శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ సీహెచ్.శ్రీనివాసా చారి

రాజేంద్రనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాజేంద్రనగర్ భవానీనగర్ కాలనీలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీలో 470 మార్కులకు గాను టి.వైష్ణవి 467 మార్కులు, డి.మేఘన 466 మార్కులు సాధించారు. అలాగే బి.వి.నాగ దివ్యశ్రీ 466 మార్కులు, ఇంకా 465, 465, 465, 464, 464, 464, 463, 463, 462, 462, 461, 461, 461, 460, బైపీసీ విభాగంలో ఎస్.వర్షా కుమారి, విద్యా కుంబర్ 435, పూజ యాదవ్ 430, 429, 428, 428, ఎంఈసీ విభాగంలో 500 మార్కులకు గాను అర్చన కాకడ 483, సీఈసీలో పి.పావనీ 488 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ముద్దం శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ సీహెచ్.శ్రీనివాసా చారి విద్యార్థులను తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

అయోమయంలో కార్వాన్ కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో హైదరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై అయోమయం నెలకొని ఉంది. ఓ వైపు మజ్లిస్, మరోవైపు బీజేపీ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం తమ అభ్యర్థిగా సమీఉల్లాను ప్రకటించింది. అయితే సమీఉల్లా ఎవరో తమకు తెలియదని కార్వాన్‌లోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. మజ్లిస్‌కు పరోక్షంగా తమ పార్టీ మద్దతు తెలుపుతున్న విషయం తమకు తెలుసని అయితే అభ్యర్థి ప్రకటనపై తామంతా అయోమయంగా ఉన్నామని పలువురు సీనియర్ నాయకులు అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నయం అనిపించుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం చతకీల పడడం ఖాయమని పలువురు అంటున్నారు.